మెదక్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

సంగారెడ్డి బ్యూరో జూన్ 17, ప్రభాతవార్త: మెదక్ మున్సిపాలిటీ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు తయారుచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మెదక్ మున్సిపాలిటీ పరిధిలో చిల్డ్రన్స్ పార్క్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఏరియా, వివిధ వార్డులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు కృషితో మున్సిపాలిటీ అభివృద్ధికి సీడీఎం ఈగ్రాంట్‌ద్వారా భారీఎత్తున నిధులు మంజూరు చేయడానికి, మేజర్ రోడ్స్, డ్రైన్స్, నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధంచేయమని చెప్పడంతో, క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. ప్రాధాన్యత అంశాలను పరిగణలోకి తీసుకుని అవసరమైన ప్రాంతాలలో ప్రజలకు ఉపయోగకరంగా ఉండేవిధంగా వీటికి సంబంధించి ప్రతిపాదనలో సిద్ధంచేయాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డిఈ మహేష్, ఏఈ నితిన్, అధికారులు పాల్గొన్నారు.

అటవీ, రెవెన్యూ భూ వివాదం త్వరలో పరిష్కరిస్తాం : అదనపు కలెక్టర్ నగేశ్

రామాయంపేట, జూన్ 17, ప్రభాతవార్త : అటవీ, రెవెన్యూ భూ వివాదం త్వరలో పరిష్కరిస్తామని భూ భారతి రెవెన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ నగేశ్ తెలిపారు. మంగళవారం పర్వతాపూర్ రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ, రైతులు సమస్యలపై సమర్పించిన దరఖాస్తులను పూర్తిగా పరిశీలించి, 45 రోజుల్లో రెవెన్యూ సమస్యలను పూర్తిగా పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు . ఈ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రైతులు తమ గ్రామాల్లోని రెవెన్యూఅటవీ భూ వివాదాలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, పర్వతాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 150కి సంబంధించిన అటవీ రెవెన్యూ సమస్యను అదనపు కలెక్టర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీనిపై ఉమ్మడి సర్వే నిర్వహించి పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. భూమి విస్తీర్ణం తప్పులు, పేరు సరిపోలకపోవడం వంటి చిన్న సమస్యలను కూడా ఈ రెవెన్యూ సర్వేల ద్వారా పరిష్కరించవచ్చని తెలిపారు. అన్ని సమస్యలు రాబోయే 45 రోజుల్లో పరిష్కరించి, తగిన వివరాలను అందిస్తామని అదనపు కలెక్టర్ పునరుద్ఘాటించారు. ఈ రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ రజిని కుమారి, ఆర్ఐ మహమ్మద్ గౌస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీపీ డాక్టర్ అనురాధ

ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వహించాలి

సిపి డాక్టర్ అనురాధ

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు ఎల్లవేళాల అందుబాటులో ఉండి సేవలు అందించి రోల్ మోడల్‌గా ఉండాలని సీపీ డాక్టర్ అనురాధ సూచించారు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో శిక్షణ పొందుతున్న ప్రొబిషనరీ ఎస్ఐలకు రాబోవు రోజులలో నిర్వహించే విధులపై దిశా నిర్దేశం చేసి మాట్లాడారు. నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని టెక్నాలజీ బాగా ఉపయోగపడుతుందన్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యనువిని పరిష్కరించాలన్నారు. డయల్ 100కు వెంటనే స్పందించాలన్నారు. పోలీసు ఉద్యోగం ద్వారా ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలన్నారు. ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వహించాలన్నారు. సైబర్ నేరాలు, సామాజిక రుక్మతలు,గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రొబిషనరీ ఎస్ఐలు,ఎస్‌బి సిఐ శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ నబ్ స్టేషన్ మరమ్మతులకు రూ.12.34 లక్షలు మంజూరు

పాపన్నపేట, జూన్ 17, ప్రభాతవార్త : సమన్యలతో కునారిల్లుతున్న కొడుపాక నబ్‌స్టేషన్ మరమ్మతులకు రూ.12,34,887 మంజూరయ్యాయి. 20 ఏళ్ల క్రితం కొడుపాకలో నిర్మించిన నబ్జెస్టేషన్ చుట్టూ ఆర్నీసి పోల్సో తోపాటు ఫెన్సింగ్,యార్డు ఏర్పాటు,బోరుబావి,కంట్రోల్ రూం మరమ్మతుల కోసం నిధులు మంజూరి చేస్తు నదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ చైర్మన్ ముషారఫ్ ఫరూఖి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలి

-గజ్వేల్ ఎసిపి నర్సింలు

ములుగు, జూన్ 17 (ప్రభాతవార్త): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామాల్లోని ప్రజలు ప్రశాంతంగా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, ఎన్నికలు వస్తుంటాయి పోతుంటాయి కానీ ప్రజలు కలిసి మెలసి ఉండాలని గజ్వేల్ ఏసిపి నర్సింలు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి, ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్‌తో కలిసి పర్యటించి గ్రామ ప్రజలతో ముఖాముఖి చర్చ నిర్వహించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలు ఎలా ఉండాలి అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని, ఎవరి ఒత్తిడికి లొంగకుండా ప్రజాస్వామ్యయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎవరైనా ఒత్తిడి చేస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. రోజు రోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల వాటి నుంచి ఎంత దూరంగా ఉంటే అంత బాగుంటుందని, సైబర్ నేరాల పట్ల ఎలా జాగ్రత్తపడాలో వివరించారు. ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి లింక్స్ ఖాతా నెంబర్లు వంటి వివరాలు అడిగితే ఎలాంటి సమాచారాన్ని వారికి ఇవ్వకూడదని తెలిపారు. మహిళల రక్షణ కోసం షీటీమ్స్ సేవలను ఉపయోగించుకోవాలని, మహిళలపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న గజ్వేల్ ఏసిపి నర్సింలు

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమవతి

కొండపాక, జూన్ 17, ప్రభాతవార్త :

భూ యాజమాన్య వివరాలతో రెవెన్యూ విలేజ్ ప్రొఫైల్‌ను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమవతి రెవెన్యూ అధికారులను అదేశించారు. మంగళవారం అంకిరెడ్డిపల్లిలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సును ఆమె ఆకస్మికంగా సందర్శించి దరఖాస్తులు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి రైతుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రభుత్వం భూ భారతి ఆర్ఓఆర్ చట్టం తీసుకొచ్చిందన్నారు. ఎలాంటి భూ సమస్యలు ఉన్న రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. అదే విధంగా అసైన్డ్ భూములను కొనుగోలు చేసిన పేదవారి పేరుమీద భూ హక్కులను బదిలీపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న చర్యలు తీసుకుంటామని అప్పటి వరకు దరఖాస్తులు అన్‌లైన్ చేసి భద్రంగా ఉంచుతామన్నారు. రెవెన్యూ సదస్సులో రైతుల పెట్టుకునే ప్రతి అర్జీకి సంబంధించిన భూ వివరాలను రెవెన్యూ రికార్డుల్లో క్షుణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తు లన్నింటిని కచ్చితంగా అన్‌లైన్‌లో పొందుపరచాలని, అలస్యం చేయకుండాఅవసరమైన వారికి నోటిసులు జారీచేసి సాదా బైనామా, సీలింగ్, సర్వే నంబర్, భూ విస్తీర్ణంలో మార్పులు, చేర్పులు, లావణిపట్టా అన్నిరకాల భూ సమస్యలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేలా పని చేయాలని రెవెన్యూ గ్రామంలో రైతులు, వ్యవసాయ భూమి, ప్రభుత్వ భూమి, తదితర భూమి పూర్తి వివరాలతో విలేజ్ ప్రొఫైల్ తయారు చేయాలని తహసీల్దార్ వై.శ్యామ్‌ను అమె ఆదేశించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంకిరెడ్డిపల్లిలో రైతులనుండి దరఖాస్తులు తీసుకుంటున్న జిల్లా కలెక్టర్ హైమవతి

ఆయిల్‌పామ్ పంటను సాగు చేయాలి...

కొండపాక, జూన్ 17, ప్రభాతవార్త : రైతులు ఆదాయాన్నిపెంచుకోవడానికి ఆయిల్‌పామ్ మొక్కల పెంపకానికి ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ కె. హైమవతి సూచించారు. మంగళవారం కొండపాక మండల పరిధిలోని బందారంలో నర్రా జైపాల్‌రెడ్డి 10 ఎకరాల పొలంలో ఆయిల్ పామ్ మొక్కలను పెంచారు. ఆయిల్ పామ్ మెగా ప్లాంటెషన్ డ్రైవ్‌లో భాగంగా ఆయిల్ పామ్‌ను ఆమె సందర్శించి, ఆయిల్ పామ్ మొక్కను నాటి మాట్లాడారు. మన జిల్లాలో అయిల్ పామ్ సాగు చేయడం కొనసాగుతుందన్నారు. ఇప్పటికి 1200 లన్నుల ఆయిల్ పామ్ గెలలను ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. ప్రతి 15 నుండి 20 రోజులకు ఒకసారి అయిల్ పామ్ పంటను కొయటం జరుగుతుందని తెలిపారు. 2025,2026 సంవత్సరానికి జిల్లా టార్గెట్ 6500 ఎకరాలన్నారు. రైతులు అధిక లాభాలు పొందడానికి ఆయిల్‌పామ్ పంటసాగుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు శాఖ అధికారి సువర్ణ, అయిల్ పెడ్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, కొండపాక డివిజన్ వ్యవసాయ అధికారి బాబు, మండల ఉద్యాన అధికారి కౌసల్య, ఎఒ శివరామ్, అధికారులు బాలాజి, రమేష్, మౌనిక, ఎఈఒ ప్రనుషా, ఫీల్డ్ ఆఫీసర్ రాజు, గ్రామస్తులు, నర్రా జైపాల్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతి వల్లూరు

అందరి సహకారంతోనే సంగారెడ్డి జిల్లాలో అభివృద్ధి చేయగలిగాను

ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో క్రాంతి వల్లూరు

సంగారెడ్డి మున్సిపాలిటీ జూన్ 17, ప్రభాతవార్త :

జిల్లాలోని అధికారులు సిబ్బంది సహకారంతో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు విజయవంతంగా ముందుకు తీసుకు వెళ్ళగలిగానని జిల్లా కలెక్టర్‌గా, పనిచేసి బదిలీపై వెళుతున్న క్రాంతి వల్లూరు అన్నారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్లోని ఆడిటోరియం లో రెవెన్యూ మరియు జిల్లా అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో పాల్గొని క్రాంతి వల్లూరు మాట్లాడారు. జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ, జిల్లా ప్రజాప్రతినిధుల సహకారం మరువలేనిదని అన్నారు. జిల్లా డ్వాక్రా మహిళల అభివృద్ధిని ప్రధానమంత్రి కొనియాడడం జిల్లాకు గర్వకారణం అని చెప్పారు. భూ సమస్యలకు సంబంధించి చాలా ఫైళ్లను పరిష్కరించామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గంగాధర్, జావిద్‌అలీ, వైద్యనాథ్, డిఆర్ఓ, ఆర్‌డిఓలు, జిల్లా అధికారులు, జిల్లాలోని తహసీల్దాలు ఎంపీడీవోలు సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగులకు ర్యాంప్‌లు ఏర్పాటు చేయించాలి

సంగారెడ్డి టౌన్, జూన్ 17, ప్రభాతవార్త:

పోలీసు ఠాణాల్లోకి వికలాంగులు సునాయాసంగా వెళ్లేందుకు ర్యాంప్‌లు ఏర్పాటు చేయాలని తెలంగాణ వెన్నెముక గాయ వికలాంగుల సంఘం (ఎస్‌సి ఐఎటి) అధ్యక్షులు ఎండి షఫీ ఆహ్మద్ ఖాన్ కోరారు. మంగళవారం సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్‌కు షఫీ ఆహ్మద్ ఖాన్ వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా షఫీ ఆహ్మద్ ఖాన్ మాట్లాడుతూ వికలాంగుల హక్కుల చట్టం వృద్ధుల సంక్షేమ చట్టాలను జిల్లాలో కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని పోలీసు ఠాణాల వద్ద వీల్ చైర్ వినియోగదారుల కొరకు ర్యాంప్‌లు,ఇతర ప్రవేశ సౌకర్యాలు వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. 2025 జూన్ 16న ప్రభుత్వ జారీ చేసిన మెమో ప్రకారం అన్ని పోలీసు ఠాణాలతో సహా, ప్రభుత్వ కార్యాలయాల్లో వికలాంగులకు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం అధికారులపై ఉందని, సౌకర్యాలు కల్పిస్తే వికలాంగులు ఇతరు సహాయం లేకుండా నేరుగా ప్రభుత్వ కార్యాలయాలకు చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. పోలీసు ఠాణాల్లో వికలాంగులు, వృద్ధుల హక్కులపై అవగాహన పోస్టర్లు ప్రదర్శించాలన్నారు. జిల్లా ఎస్‌పిని కలిసిన వారిలో వికలాంగుల బంధంలో దివ్యాంగ సంఘం నాయకులు రామ్‌శెట్టి, మహేష్ కుమార్, వెంకట్, నవ భారత్ పోచయ్య, డి ప్రవీణ తదితరులు ఉన్నారు.

జిల్లా ఎస్‌పికి వినతిపత్రం అందచేస్తున్న ఎస్‌సిఐఏటి రాష్ట్ర అధ్యక్షుడు

గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు

జడ్పీ సిఇవో ఎల్లయ్య

చిన్నశంకరంపేట, జూన్ 17,ప్రభాతవార్త:

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జెడ్పి సిఈఓ ఎల్లయ్య అన్నారు. మంగళవారం నాడు చిన్న శంకరంపేట పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంను జడ్పీ సీఈఓ ఎల్లయ్య ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వర్షాకాలం ఉన్నందున సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్ధం లోపించకుండా చర్యలు చేపట్టాలన్నారు. పైపులైన్ పగిలిన వెంటనే మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు మురికి కాలువలు శుభ్రం చేసేలా పంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకోవాలన్నారు. సమయపాలన పాటించాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీవో దామోదర్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

మెదక్ బ్యూరో, జూన్ 17 (ప్రభాతవార్త) : బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న హత్యకేసులో నిందితుడు మంగలి భాస్కర్‌కు జీవిత ఖైదు విధిస్తూ, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి శ్రీమతి జి.భవానీ చంద్ర తీర్పు ఇచ్చారు. శిక్షతోపాటు రూ.500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే 15 రోజుల సాధారణ జైలుశిక్ష విధించాలని ఆదేశించారు. కేసు వివరాలల్లోకి వెళ్లితే... మాదారం గ్రామం, జిన్నారం మండల నివాసితురాలు ఫిర్యాది మంగలి లక్ష్మి తండ్రి నారాయణ, ద్వారా తెలిసినది ఏమనగా ఫిర్యాది చెల్లెలు కొడుకు మంగలి బాబు తండ్రి సాయిలు, వయస్సు 26 సంవత్సరాలు, నివాసం మాదారం గ్రామం, జిన్నారం మండలం. మద్యం తాగి ఫిర్యాది అక్క రాములమ్మను తరుచూ అసభ్యంగా తిట్టేవాడని, ఈ విషయంలో రాములమ్మ కొడుకు మంగలి బాస్కర్, బాబుల మధ్య గొడవ జరిగేది. కాగా నవంబర్ 11, 2021 రాత్రి 7.30 గంటల సమయంలో వారి ఇంటిలోనే నిందితుడు భాస్కర్, బాబును మద్యం సీసాతో గొంతు, కడుపులో పొడిచి చంపాడని చట్టరీత్యా చర్య తీసుకోవలసిందిగా బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి యస్‌హెచ్ఒ జి.ప్రశాంత్ ఇన్‌స్పెక్టర్ కేసు నమోదుచేసి, ఇన్వెస్టిగేషన్ అనంతరం న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేయగా, కేసు పూర్వపరాలను విన్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి శ్రీమతి జి. భవానీ చంద్ర నిందితునికి యావజ్జీవ కారాగారశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితుని వివరాలు: మంగలి భాస్కర్ తండ్రి స్వ.కృష్ణ సాయిలు, వయస్సు 25 సంవత్సరాలు, వృత్తి బార్బర్, మాదారం గ్రామం, జిన్నారం మండలం, సంగారెడ్డి జిల్లా. నిందితునికి శిక్షపడేలా కృషి చేసిన అధికారులు అప్పటి ఎస్‌హెచ్ఒ జి.ప్రశాంత్ ఇన్‌స్పెక్టర్, ఇన్వెస్టిగేషన్ అధికారి, ప్రస్తుత ఎస్‌హెచ్ఒ రవీందర్‌రెడ్డి ఇన్‌స్పెక్టర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ, కోర్ట్ డ్యూటీ కానిస్టేబుల్స్ అశోక్, కోర్ట్ లైజనింగ్ అధికారి రాజశేఖర్, హెడ్.కానిస్టేబుల్, కె. సత్యనారాయణ ఎస్ఐ.ను అభినందించారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

జహీరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్థాపం చెందిన విద్యార్థి వెంకటరమణ సోమవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రాయిపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం... జహీరాబాద్ పట్టణంలోని ఆర్ఎల్ఆర్ కళాశాలలో బైపిసి రెండవ సంవత్సరంలో విద్యను అందుకుంటున్నాడన్నారు. సోమవారం విడుదలైన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో వెంకటరమణ ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయ్యాడన్నారు. ఫెయిన అయినట్లు తెలుసుకున్న వెంకటరమణ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతి చెందిన విద్యార్థి వెంకటరమణ తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినయ్‌కుమార్ వివరించారు.

దాసుతండాలో విద్యార్థిని...

అక్కన్నపేట, జూన్ 17, ప్రభాతవార్త : ఇంటర్ ఫెయిలైనందుకు మనస్థాపానికి గురైన గుగులోతు హారిక(17) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నసంఘటన మండలంలోని దాసుతండాలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే... సోమవారం విడుదలైన ఇంటర్ మీడియట్ సప్లమెంటరీ ఫలితాలలో హారిక ఫెయిల్ అయింది. అయితే విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆమెను మందలించారని, దీంతో మనస్థాపానికి గురైన బాలిక మద్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న తల్లితండ్రులు బంధువులు కన్నీరు మున్నీరుగా విలవించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో వివాహిత...

అక్కన్నపేట, జూన్ 17, ప్రభాతవార్త : కుటుంబ కలహాలతో వివాహిత భూక్య శ్రీవాణి(27) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మల్చేరువుతండాలో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే... శ్రీవాణి అత్తతోపాటు భర్త అదనపు కట్నం తీసుకురావాలని తరచూ గొడవలు పడేవారు. దీంతో ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేసుకోగా గమనించిన స్థానికులు హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిసిం. శ్రీవాణి మృతదేహానికి హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలోనే పోస్టుమార్టం నిర్వహించారు. ఆత్మహత్య విషయంలో మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు. మృతురాలికి రెండు సంవత్సరాల కూతురితో పాటు ఒక సంవత్సరం కుమారుడు ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

ఉరేసుకుని ప్రేమ జంట...

వర్గల్, జూన్ 17 (ప్రభాతవార్త): కుటుంబసభ్యులు ఒప్పుకోకపోవడంతో ప్రేమ జంట ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వర్గల్ మండలం అవుసులోనిపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని అవుసులోనిపల్లి గ్రామానికి చెందిన చెక్కల ఆంజనేయులు కూతురు చెక్కల కల్పన(18) అదే గ్రామానికి చెందిన ఉప్పరి మల్లేశం కుమారుడు ఉప్పరి శివకుమార్(21)లు గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇది వారి కుటుంబసభ్యులు ఒప్పుకోకపోవడంతో కల్పన కుటుంబసభ్యులు లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అలాగే ఉప్పరి శివకుమార్ వారి వ్యవసాయ పొలం వద్దకు వెళ్తున్నాని చెప్పి వెళ్ళి అక్కడ ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇరువురి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులపై ఫీజుల భారం

*** కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీ * చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల డిమాండ్**

హుస్నాబాద్ రూరల్, జూన్ 17, ప్రభాతవార్త

హుస్నాబాద్‌లో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు దోపిడీ విధానాన్ని అమలుచేస్తున్నాయి. ఫీజులు ఇష్టారాజ్యంగా పెంచడంతో పాటు వివిధ రకాల రుసుములు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈవిషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థిసంఘాలు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదు. హుస్నాబాద్ మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 40 వరకూ ఉన్నాయి. వీటిలో ప్రైవేట్ పాఠశాలలు పది వరకు ఉన్నాయి. ఈ కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలలో దాదాపు 5వేలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం 2 వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. కాగా ప్రస్తుత విద్యా సంవత్సరం మొదటి నుండే ప్రయివేట్ పాఠశాలలు భారీగా ఫీజులు పెంచారు. ఇక కార్పొరేట్ పాఠశాలల విషయానికి వస్తే ఐఐటి, ఇతర ఫౌండేషన్‌ల పేరట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పి సంవత్సరానికి రూ 20 వేల నుండి 50వేల వరకు సంస్థల స్థాయిని బట్టి ఫీజులు వసూలు చేస్తున్నారు. కొన్ని చిన్న స్థాయి విద్యా సంస్థలు నెల వారిగా 15 వందల నుండి 3వేల వరకు వసూళ్లు చేస్తున్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఈ విద్యాసంవత్సరం 20 నుండి 40 శాతం వరకు పెంచడంతో విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు కొన్ని గుర్తింపు లేని పాఠశాలలు రోడ్లపై ప్లెక్సీలు పెట్టి మరి ప్రచారం నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోకపోగా షోకాజ్ నోటీసులు ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారు. పట్టణంలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాంలు విక్రయించేందుకు బుక్‌స్టాల్స్‌తో కుమ్మకయ్యాయి. యాజమాన్యాలు ముందుగానే విద్యార్థులకు సంబందించిన పుస్తకాలను తెప్పించి బుక్‌స్టాల్స్‌లో వారు చెప్పిన ధరలకు విక్రయించాలని ఒప్పందం కుదుర్చుకుని విద్యార్థుల తల్లితండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారు. తరగతులను బట్టి పుస్తకాలు,యూనిఫాంలకు రూ 3వేల నుండి 10వేల వరకు వసూళు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించాలనే మోజులో ఉన్న విద్యార్థుల తల్లితండ్రులు నానా అవస్థలుపడి వేలాది రూపాయలు చెల్లిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల బలహీనతను ఆసరా చేసుకున్న యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా వేలాది రూపాయల దోపిడీ చేస్తున్నారు. ఈ ఫీజుల భారం మోయలేక విద్యార్థుల తల్లితండ్రులు ఉక్కిరిబిక్కిరై ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్నారు. హుస్నాబాద్ లోని ప్రయివేట్ పాఠశాలల్లో గల తరగతి గదుల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. పాఠశాలల అనుమతుల సమయంలో కొందరు విద్యాశాఖ అధికారుల చేతివాటంతో ఆట స్థలంతో పాట

రాజీవ్‌సాగర్‌పై దుష్ప్రచారాన్ని ఆపాలి

సైఫాబాద్, జూన్ 17 ప్రభాతవార్త: దళిత సమాజాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా మేడే రాజీవ్‌సాగర్‌పై దుష్ప్రచారం తగదని, తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఇకనైనా కాంగ్రెస్ పార్టీ విషప్రచారాన్ని మానుకోవాలని పలు దళిత క్రిస్టియన్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల ప్రముఖ గాయని మంగీ బర్త్‌డే వేడుకల్లో మేడే రాజీవ్‌సాగర్ ఉన్నారని కొంత మంది చేసిన తప్పుడు ప్రచారాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రిస్టియన్ జెఎసి ఛైర్మన్ సాల్మన్‌రాజు, క్యాథలిక్ చర్చి అసోసియేషన్ కార్యదర్శి లియోలూయిస్ మాట్లాడుతూ ఇది కేవలం రాజీవ్‌సాగర్‌పై వ్యక్తిగత విమర్శలు కాదని, దళిత క్రిస్టియన్ సమాజాన్ని లక్ష్యంగా చేసుకున్న కుట్రగా ఉందని, ఆయన ప్రజల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. క్రైస్తవులు రాజకీయంగా ఎదగకుండా చేసేందుకు ఇదోక ప్రయత్నమని వారు విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌సాగర్‌పై దుష్ప్రచారాన్ని ఆపాలని వారు డిమాండ్ చేశారు.

బాలబాలికలకు అక్షర అభ్యాసం చేయించిన కార్పొరేటర్

అంగన్‌వాడిలో బాలబాలికలకు అక్షర అభ్యాసం

బేగంబజార్, జూన్ 17ప్రభాతవార్త: బడి బాట కార్యక్రమంలో భాగంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ కమ్యూనిటిహాల్‌లో అంగన్‌వాడి టీచర్లు నిర్వహించిన అక్షర అభ్యాసం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్‌గొంటి శంకర్‌యాదవ్ పాల్గొన్ని బాలబాలికలకు అక్షర అభ్యాసం చేశారు. ఈకార్యక్రమంలో బేగంబజార్ డివిజన్ బిజెపి అధ్యక్షులు బండ క్రాంతి కుమార్, సుదీర్ సింగ్, శ్రీనివాస్, అంగన్‌వాడి టీచర్లు లక్ష్మి, విద్యావతి, వనితఠాకూర్, లక్ష్మి, గిరిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి : ఆనంద్ కుమార్‌గౌడ్



డిసికి వినతి పత్రం అందచేస్తున్న బిఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్

అఫ్జల్‌గంజ్, జూన్ 17ప్రభాతవార్త: ఆషాడ మాసం బోనాల ఉత్సవాలకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని కోరుతూ గోషామహాల్ నియోజకవర్గం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎం.ఆనంద్ కుమార్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గోషామహాల్ జిహెచ్ఎంసి సర్కిల్ 14 డిప్యూటి కమీషనర్ లావణ్యకు ఆనంద్ కుమార్‌గౌడ్ బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. గోషామహాల్ నియోజకవర్గంలోని ఉన్న దేవాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. అంతేకాకుండా పండుగనెల రోజుల సమయం ఉంది కాబట్టి ముందుస్తుగా దేవాలయాలవద్ద ప్యాచ్‌వర్క్, డ్రైనేజీ సమస్యలను నివారించి అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. జూలై 16,17 తేదిలల్లో చాక్నవాడి, మహారాజ్‌గంజ్ బోనాల పండుగ జరుగుతుందన్నారు. 20,21 తేదిలలో గోషామహల్ నియోజకవర్గంలో పూర్తిగా బోనాల పండుగను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మహ్మద్ అహ్మద్, నరేష్‌గౌడ్, భజన్‌సింగ్, మహేందర్ పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయండి

పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

కెపిహెచ్బి కాలనీ, జూన్ 17, ప్రభాతవార్త

కాల్వీన్ కాలనీ డివిజన్లో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను విధిగా పాటించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సూచించారు. మంగళవారం కాలుని కాలనీ డివిజన్లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. డివిజన్ పరిధిలోని శంషిగుడాలో ఇరవైరెండు లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతుందని ఈ విషయంలో జి.ఎచ్.ఎం.సి అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచి పోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలి

అత్తాపూర్ జూన్ 16,ప్రభాతవార్త :

ప్రధాని నరేంద్రమోడీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో దూసుపోతుందని పలువురు బిజెపి నేతలు పేర్కొన్నారు. బిజెపి రాజేంద్ర నగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం తల్లి వందనం కార్యక్రమంలో భాగంగా ఉప్పర్ పల్లి గవర్నమెంట్ స్కూల్ ,పోచమ్మ దేవాలయం మరియు బిజెపి పార్టీ కార్యాలయం దగ్గర బిజెపి నేతలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ....భవిష్యత్ తరాల కోసం ప్రతి మొక్కలు నాటాలని సూచించారు. 11ఏళ్ల పాలనలో దేశం ఎంతో పురోగతి సాధించిందని దేశం ప్రజలు ప్రధాని నరేంద్రమోడీని ఎంతో విశ్వస్తున్నారని అన్నారు. పేదలకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందజేస్తుంని కేంద్ర పథకాలను పేద ప్రజలకు వివరించి అర్హులకు అందేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, బొక్క బాల్రెడ్డి ,సత్యనారాయణ ముదిరాజ్, సోల్కర్ రెడ్డి, వనిత రెడ్డి, కీర్తి శ్రీను, శ్రీకాంత్ రెడ్డి, బండారి బాలకృష్ణ, మల్లేష్ చారి, శ్రీనివాస్ రెడ్డి, సురేందర్, అశోక్ రెడ్డి, మోహన్ రెడ్డి, పద్మావతి, స్వప్నరెడ్డి, యాదయ్య, విజయ యాదవ్ తుంగ ఇంద్ర రెడ్డి ,రాజశేఖర్ రెడ్డి, పవన్ ,లడ్డూ, కర్ణాకర్ గౌడ్ నాయకులు పాల్గొన్నారు

వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

-అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
-డిప్యూటీ కమిషనర్ రవి కుమార్

అత్తాపూర్ జూన్ 16,ప్రభాతవార్త :

రాబోయే వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ పేర్కొన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలో సర్కిల్ లెవల్ మాన్సూన్ ప్రిపరేషన్‌లో భాగంగా లైన్ డిపార్ట్‌మెంట్, వాటర్‌వర్క్స్, ఇంజనీరింగ్ సెక్షన్, ట్రాఫిక్ పోలీసు, వివిధ శాఖలతో డిప్యూటీ కమిటీషనర్ రవి కుమార్ రివ్యూవ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిసి మాట్లాడుతూ....వర్షాకాలం మొదలు కావడంతో కొన్ని ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయని దింతో రోడ్లపై నీరు నిల్వగా ఉండడంతో ఎక్కడికి అక్కడ చెత్త పేరుకొని ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వర్షనీటిని తోలగిస్తు ట్రాఫిక్ ,ఇతర సమస్యలు రాకుండా చూసుకోవాలని సూచించారు. ఎక్కడైనా సమస్య వస్తే వెంటనే స్పాట్‌కి చేరుకొని మ్యాన్‌హోల్ ఓపెన్ చేయాలన్నారు. రాజేంద్రనగర్ మాన్సూన్ కన్వెర్జెన్స్ గ్రూప్ ఏర్పాటు చేయడం జరిగిందని కాబట్టి ఏదైనా సమస్య వస్తే గ్రూప్‌లో పోస్ట్ చేయాలని అన్నారు. పురాతన భవనాలు గుర్తించి వారిని సురక్షిత ప్రాంతానికి తరలించాలని అదేవిధంగా హైడ్రా నుండి వార్డుకి 9 మంది సిబ్బంది ఉన్నారని కాబట్టి ఏదైనా సమస్య వస్తే వారికి కూడా సమాచారం ఇచ్చి సమస్య పరిష్కరించుకోవాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌తో వ్యక్తిగత స్వేచ్ఛను భంగం కలిగించడం దుర్మార్గమైన చర్య

- టిపిసిసి అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

కెపిహెచ్బి కాలనీ, జూన్ 17, ప్రభాతవార్త

తప్పు చేసిన వారెవరైనా శిక్షార్హులే చట్టం నుండి ఎవరు తప్పించుకోలేరని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ఫోన్ ట్యాపింగ్‌లో భాగంగా నా వ్యక్తిగత పొలిటికల్ నెంబర్ రెండు ఫోన్ నెంబర్లు ఫోన్ ట్యాపింగ్ అయ్యాయని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో 2023 ఎన్నికల సమయంలో నవంబర్ 14 నుండి 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 600 ఫోన్లు ట్యాపింగ్ చేసారని కాంగ్రెస్ పార్టీ నాయకులవి 450 పైన మిగితావి వివిధ రంగాల వారివి ట్యాపింగ్ చేసారని సిఐ చెప్పారని అన్నారు. అందులో నా నెంబర్లు ఉన్నాయని చెప్పారు. ఇందులో కేసీఆర్, ఆనాటి పాలకుల ఆలోచన ప్రతిపక్ష పార్టీలు బ్రతకొద్దని, ట్యాపింగ్ ఆయుధంతో రాజకీయ నేతలను, సినీ ప్రముఖులను, వ్యాపారవేత్తలను, న్యాయమూర్తులను అందరిని బ్లాక్ మెయిల్ చేసి అందరి జీవితాలతో ఆడుకున్నారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసి అనేక కుటుంబాలలో చిచ్చు పెట్టి, ప్రతిపక్ష నాయకులకు నిద్రలేకుండా చేసి, వారు చేసే పనులను తెలుసుకోని బ్లాక్ మెయిల్ చేసి రాజకీయంగా వాడుకున్న దుర్మార్గమైన చర్య ఈ తెలంగాణ రాష్ట్రంలో జరిగితే దేశం మొత్తం ఉలిక్కిపడిందని అన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ గత 8 ఏళ్లపాటు ఫోన్ ట్యాపింగ్‌లు చేసారని, ఆ నాటి ప్రతిపక్ష నేత, నేటి ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్టుగానే అవినీతి చేసిన వాళ్ళని చట్టం ముందు నిలబెడుతా ప్రభాకర్ రావు మీరు ఏ దేశంలో దాక్కున్నా తెలంగాణకు పిలిపిస్తా చట్టం ముందు నిలబెట్టే బాధ్యత నాదని, ఈ రోజు అదే జరుగుతుందని అన్నారు. ఈ ఫోన్ ట్యాపింగ్‌లో ఎస్‌బిఐ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుని మిగితా నిందితులందరిని వెంటనే శిక్షించాలని సత్యం శ్రీరంగం డిమాండ్ చేసారు.

సెల్‌ఫోన్ల దొంగలు అరెస్టు ... రూ.25 లక్షల సొమ్ము స్వాధీనం

కంటోన్మెంట్, జూన్ 17 ప్రభాతవార్త: సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్న ముగ్గురి నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.25 లక్షల విలువ చేసే సెల్‌ఫోన్లు, 2 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు బేగంపేట్ ఏసిపి పి.గోపాల క్రిష్ణ మూర్తి తెలిపారు. మంగళవారం బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒడిసా రాష్ట్రం జైపూర్‌కు చెందిన గంట చిన్నా (40) దిల్‌సుఖ్ నగర్ నివాసం ఉంటున్నాడు. అదే విధంగా మల్లాపూర్ హౌజింగ్ బోర్డుకు చెందిన ప్రధాన్ శ్రీకాంత్ 22, అవుల గోపిరావు 20, అనే ముగ్గురు వ్యక్తులు నెంబర్ ప్లేట్లులేని రెండు బైక్‌లతో అనుమానస్పదంగా సంచరిస్తున్నారు. ఉప్పల్‌లోని ఫిర్జాదిగూడకు చెందిన రాజ నర్సింహ్మ ఈ నెల 13వ తేదీన మధ్యాహ్నం ఫుట్‌పాత్ సిగ్నల్ దాటుతుండగా బైక్ దగ్గర పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తికి సహాయం చేయడానికి సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయాడు. అందులో ఒకరిని పట్టుకొని పోలీసులను అప్పగించారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బేగంపేట ఏసిపి గోపాల క్రిష్ణమూర్తి బోయిన్‌పల్లి సిఐ తిరుపతి రాజు, ఎస్ఐలు

వారినిఅదుపులోకి తీసుకొని విచారించగా 25 లక్షల విలువ చేసే 77 సెల్‌ఫోన్లు, 2 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసిపి తెలిపారు. దొంగిలించిన సెల్ ఫోన్లను జహింగీర్ అనే వ్యక్తి వద్ద ఉంచినట్లు తెలిపారు. జహింగీర్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, డిఐ సర్ధార్ నాయక్‌లు దర్యాప్తు చేస్తున్నారు.

భోజగుట్టలో కూల్చివేతలు.. కొద్దిసేపు ఉద్రిక్తత

మెహదీపట్నం, జూన్ 17, ప్రభాతవార్త : భోజగుట్టలో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. పెద్ద ఎత్తున పోలీసు బలగాలు భోజగోట్టను చుట్టుముట్టడంతో అక్కడ ఏం జరుగుతుందోనని స్థానికుల్లో ఆందోళన నెలకొంది. భోజగుట్టలో కూల్చివేతలు జరుగుతున్నాయని తెలుసుకున్న కొందరు స్థానికులు పోలీసులను అడ్డుకోవడంతో వారిని అదుపులోకి తీసుకొని కూల్చివేతలు ముగిసిన అనంతరం పోలీసులు వదిలేశారు. ఆసిఫ్ నగర్ మండల పరిధిలోని భోజగుట్టలో గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు కట్టించేందుకు ముందుకు వచ్చి ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి కొన్ని ఇండ్లను అసంపూర్తిగానే నిర్మించింది. డబల్ బెడ్ రూమ్ లో విషయంలో శ్రీరామ్ నగర్, శివాజీ నగర్, వివేకానంద నగర్ వాసుల్లో భిన్నాభిప్రాయాలు ఉండడంతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను ప్రభుత్వం మధ్యలోనే వదిలేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డబుల్ బెడ్ రూమ్ ల విషయం మళ్లీ తెర మీదికి రావడంతో అధికారులు బొజగుట్టలో డబల్ బెడ్ రూములను నిర్మించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా భోజగుట్ట వాసులతో జిల్లా కలెక్టర్ అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. కొద్దిరోజుల క్రితం డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి అనుకూలంగా ఉన్న వారికి ఆసిఫ్ నగర్ మండల రెవెన్యూ అధికారులు పట్టాలను కూడా అందజేసి నిర్మాణ పనుల

భోజగుంటలో రోడ్డుకు అడ్డంగా ఉన్న నిర్మాణాలను తొలగిస్తున్న ఆసిఫ్ నగర్ మండల రెవెన్యూ అధికారులు.

ను వేగవంతం చేయడానికి సిద్ధపడుతున్నారు. దీంతో భోజగుట్టలో రవాణా వ్యవస్థకు అడ్డుగా ఉన్న కొన్ని ఇండ్లను మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ నగర్ మండల తహసిల్దార్ జ్యోతి మాట్లాడుతూ...భోజగుట్టలో అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. దారికి అడ్డంగా ఉన్న, రోడ్డును ఆక్రమించి వేసిన దుకాణాలు గుడిసెలను మాత్రం తొలగించడం జరిగిందని తెలిపారు. ఈ విషయంపై ముందస్తుగానే సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. కూల్సుంపుర, ఆసిఫ్ నగర్ ఏసీపీల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

-దోమల నివారణకు కాలనీలు, పార్కులు, చెరువుల్లో ఫాగింగ్ చేపట్టాలి
-అధికారులకు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆదేశం

హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అడిషనల్, జోనల్, డిప్యూటీ కమిషనర్లు, ఏఎంఅండ్‌హెచ్‌ఓలు, ఎంటమాలజీ అధికారులతో శానిటేషన్, దోమల నివారణ, ఆస్తిపన్ను వసూళ్ల పై కమీషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ దోమల నివారణకు చేస్తున్న ఫాగింగ్ పై అసిస్టెంట్ మెడికల్ అధికారి పూర్తి బాధ్యత ఉంటుందన్నారు. ఫాగింగ్ సాయంత్రం 4 గంటల నుండి 10 గంటల వరకు తప్పని సరిగా చేయాలని, ఏఎల్ఓ లు క్షేత్ర స్థాయిలో యాంటీ లార్వా కార్యక్రమం, ఉదయం, సాయంత్రం ఫాగింగ్ పనులు చేపట్టాలన్నారు. ఫాగింగ్ సర్కిల్ వారీగా అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్, జోనల్ స్థాయిలో ఎస్ ఈ లు బాధ్యత తీసుకోవాలన్నారు.. డెంగ్యూ వ్యాధి ప్రబలిన జాబితా బస్తీ దవాఖానా, పి హెచ్ సి నుండి సేకరించిన వ్యక్తుల ఇంటి నుండి ఎస్ ఓపి కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు.

లక్ష్యం మేరకు ఆస్తిపన్ను వసూలు చేయాలి..

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఆర్.వి కర్ణన్, అడిషనల్ కమిషనర్లు రఘుప్రసాద్, పంకజ తదితరులు

అలాగే నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆస్తి పన్ను వసూలు చేయాలని బిల్లు కలెక్టర్ కు ఇచ్చిన టార్గెట్ మేరకు వసూలు చేయాల్సిందేనన్నారు. రెసిడెంట్ భవనంలో కమర్షియల్స్ చేస్తున్న ఇళ్లను గుర్తించి టాక్స్ వసులు చేయాలన్నారు. అలాగే ట్రేడ్ లైసెన్స్ లేని పక్షంలో టాక్స్ వసూలు చేయాలన్నారు. ప్రతి నెల టాక్స్ పై సమీక్ష నిర్వహిస్తామన్నారు. బౌన్స్ చెక్కులు బేగం పేట్, సరూర్ నగర్‌లో ఎక్కువ వచ్చినందున వాటిని వెంటనే క్లియర్ చేయాలని సంబంధిత డీ.సి లను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్లు రఘుప్రసాద్, పంకజ, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, హేమంత్ సహదేవ్ రావు, రవి కిరణ్, వెంకన్న, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ మెడికల్ అధికారులు, ఎంటమాలజి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య భోజుడు గోన బుద్ధా రెడ్డి : సిరికొండ మధుసూదనాచారి

చిక్కడపల్లి, జూన్ 17 ప్రభాతవార్త: తెలుగులో తొలి సారిగా వాల్మీకి సంస్కృత రామాయణాన్ని రంగనాథ రామాయణం పేరిట అనువదించిన వారు గోన బుద్ధారెడ్డి అని శాసన మండలి లో ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. అయన సాహిత్య భోజుడు గా నాటి కాలం గుర్తింపు పొందారని చెప్పారు. మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని గుండవరపు హనుమంత రావు కళా వేదిక పై గానసభ నిర్వహిస్తున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా తెలుగు కవి గోన బుద్ధారెడ్డి యాది లో పేరిట సంస్మరణ సభ గానసభ అధ్యక్షుడు కళావిఎస్. జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధు సూదనాచారి మాటాడుతూ బుద్ధా రెడ్డి పదమూడవ శతాబ్దికి చెందినవారని, కాకతీయ ప్రభువులకు సామంత రాజు రాయచూర్ పరిగణ ను పాలించారని వివరించారు. తెలుగు సాహిత్యం విశిష్ట పెంచిన ఇట్టి వారి గురించి నేటి తరాలు తెలియజేసేందుకు గానసభ చేస్తున్న సేవ మీడియా సహసకారం అభినంద నీయం అన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జయరాములు మాట్లాడుతూ ఆంధ్ర మహా భారత రచన చేసిన తిక్కన సమకాలీకు డు

ప్రసంగిస్తున్న శాసన మండలి లో ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి

బుద్ధ రెడ్డి అని రాణి రుద్రమ దేవి సమకాలికుడు ఐన గోన గన్నారెడ్డి కుమారుడు అని తెలిపారు సరళమైన తెలుగు లో బుద్ధ రెడ్డి రాసిన ఉదత సాయం సీతానేషణం వొక నాడు పాఠాలు గా ఉండేవి అని గుర్తు చేశారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై గాయని లక్ష్మీ శాంతి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి వార్షికోత్సవ వేడుకలు

నార్సింగి, జూన్ 17 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ హైదర్షాకోట్ గ్రామం శాంతినగర్‌లో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ 16.వ, వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయ జయ ధ్వనుల మధ్య కన్నుల పండువగా సాగాయి. మంగళవారం తెల్లవారు ఝామున నుంచే భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక "హనుమాన్ చాలీస పారాయణం" చేశారు. భక్తుల హనుమాన్ చాలిసా పారాయణంతో ఆలయమంతా మారుమ్రోగిపోయింది. ఈ వార్షికోత్సవ వేడుకల్లో మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, మాజీ కార్పోరేటర్ సంతోషి రాజిరెడ్డి, పుర ప్రముఖులు టింకూరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ హిందువులంతా దేవాలయ దర్శనం, భగవద్గీతా, హనుమాన్ చాలీసా పారాయణాలను దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. మన ధర్మంను మనం భక్తి, శ్రద్ధలతో ఆచరిస్తూ ఇతర ధర్మాలను గౌరవించాలన్నారు. పెద్దలు దేవాలయాలకు వెళుతూ తమ బిడ్డలను వెంట తీసుకెళ్లాలని, మన సనాతన

హైదర్షాకోట్ శాంతినగర్‌కాలనీలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి దేవలయ 16.వ, వార్షికోత్సవంలో పాల్గొన్న నాయకుల దృశ్యం

ధర్మం గొప్పతనంను తెలియచేస్తుండాలన్నారు. భారతదేశంలో హనుమాన్ ఆలయం లేని గ్రామం లేదని, ప్రతీ గ్రామంలో హనుమాన్ ఆలయం తప్పకుండా ఉంటుందన్నారు. ఈ ఆలయం ఉండడం వల్లనే ఆ గ్రామాల ప్రజలు దుష్ట శక్తుల, పీడల నుంచి సంరక్షింపబడుతున్నారన్నారు. బలానికి, బంటుకి హనుమాన్ మారుపేరని తెలిపారు. మన జీవితంలో ఎన్ని సంకటాలు వచ్చినా జైహనుమాన్ అని తలిస్తే అన్నీ పటాపంచలవుతాయని రాజేందర్‌రడ్డెి వివరించారు.

అభివృద్ధి పనులపై కమిషనర్ శరత్‌చంద్ర సమీక్ష

బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ అభివృద్ధిపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమీషనర్ శరత్‌చంద్ర.

నార్సింగి, జూన్ 17 ప్రభాతవార్త :

బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై, 100.రోజుల కార్యాచరణ ప్రణాలికలపై కమీషనర్ శరత్‌చంద్ర మంగళవారం అన్ని శాఖల అధికారుల, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలపై వేగంగా స్పందించాలని, జవాబుదారి తనంగా పని చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా వర్షాకాలం కావడం వలన పారిశుద్య సిబ్బంది, కార్మికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నాలాలు, మ్యాన్‌హోళ్ల వలన వరద వచ్చే సమయంలో ప్రాణనష్టం జరుగకుండా చూడాలన్నారు. చెత్త, మురుగు నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల విచారణ, రాజీవ్ వికాసం దరఖాస్తుల స్వీకరణ, నూతన రేషన్ కార్డుల విచారణ, ట్రేడ్ లైసెన్స్, జనన, మరణ దృశీకరణ పత్రాల జారీ, ఎల్ఆర్ఎస్ సర్వే, అడ్వర్‌టైజ్‌మెంట్ పన్నుల వసూళ్లు, భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల విడుదల, అక్రమ నిర్మాణాలపై చర్యలు, కోర్టు కేసులు, మహిళా సంఘాల ద్వారా స్కూల్ యూనిఫాంస్ తయారీ, నూతన సంఘాల ఏర్పాటు, వివిధ లక్ష్యాల సాధన, ఆస్థి పన్ను వసూళ్లు, వీధి దీపాల నిర్వాహణ, వన మహోత్సవం, నర్సరీల నిర్వాహణ వంటి అంశాలపై అధికారులు, సిబ్బందిని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మేనేజర్ మంజులత, డిఇఇ యాదయ్య, ఆర్ఓ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముష్కిన్ చెరువులోకి మురుగు నీరు రాకుండా చూడాలి

- మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ముస్కిన్ చెరువును సందర్శించిన బిఆర్ఎస్ నాయకుల బృందం

నార్సింగి, జూన్ 17 ప్రభాతవార్త : ముష్కిన్

విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సిడిపివో

అంగన్‌వాడీలో సామూహిక అక్షరాభ్యాసం

హుస్నాబాద్ రూరల్, జూన్ 17, ప్రభాతవార్త : పట్టణంలోని హనుమాన్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు మంగళవారం సిడిపివో జయశ్రీ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ జయశ్రీ విద్యార్థుల తల్లితండ్రులతోకలసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిచడంతో పాటు పలకలపై వారితో అక్షరాలను దిద్దించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 సంవత్సరాల లోపు పిల్లలను తల్లితండ్రులు ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాలకే పంపించాలని అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థులకు పౌష్టికాహారంతోపాటు ఉచితంగా పుస్తకాలు పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ తిరుమల, సిబ్బంది మంజూల, విద్యార్థుల తల్లితండ్రులు ఉన్నారు.

కొరివిపల్లిలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట

కొరివిపల్లిలో చిన్నారులతో అక్షరాభ్యం చేయిస్తున్న అంజమ్మ

చిన్నశంకరంపేట, జూన్ 17,ప్రభాతవార్త: మండల పరిధిలోని కొరివిపల్లిలో మంగళవారం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి హాజరైన అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అంజమ్మ మాట్లాడుతూ పిల్లల్ని అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలన్నారు.అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెంచేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చిన్నారుల చేత సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు గర్భిణీలు బాలింతలు పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకుంటే పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా పుడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలి : మున్సిపల్ కమిషనర్

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

హుస్నాబాద్ టౌన్, జూన్ 17, ప్రభాతవార్త : ప్రజలతో పాటు కిరాణా షాప్, ట్రెడర్స్, మాంసం దుఖాణాల నిర్వాహకులు ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలని మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్ అన్నారు. మంగళవారం 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా కరీంనగర్ రోడ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఉన్న పబ్లిక్ టాయిలెట్స్‌ను పర్యవేక్షించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో దుఖానాల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటుచేసి ప్లాస్టిక్ నియంత్రణతో పాటు పట్టణ పారిశుభ్రంపై అవగాహన కల్పించారు. ప్రతీ దుఖాణదారుడు లైసెన్స్ తీసుకోవడంతోపాటు, గడువు ముగిసినవారు రెన్యూవల్ చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు రాజయ్య, కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు బెజుగం బాలకిషన్, మున్సిపల్ ఏఈ పృథ్వీ, ఇంచార్జ్ మేనేజరు సంపత్‌రావు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, జాలిగం శంకర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

జవాన్‌కు ఘనంగా సన్మానం

ఆర్మీ జవాన్ మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

శివ్వంపేట, జూన్ 17 (ప్రభాతవార్త) : మండలంలోని పెద్ద గొట్టిముక్కల గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ సింగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొని సొంత గ్రామమైన పెద్ద గొట్టిముక్కలకు వచ్చిన సందర్భంగా హైస్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జవాన్ సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి ని ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఆపరేషన్ సిందూర్లో మరణించిన ఆర్మీ జవాన్లకు ఘన నివాళుర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్ పాస్ చార్జీలు పెంచడం సరికాదు

చిన్నశంకరంపేట, జూన్ 17, ప్రభాతవార్త: విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న క్రమంలో ప్రభుత్వం బస్‌పాస్ చార్జీలను పెంచి పేద విద్యార్థులపై భారం మోపుతుందని బిఆర్ఎస్ పార్టీ యువజన మండల ప్రధాన కార్యదర్శి అత్తిలి నాగరాజు విమర్శించారు. మంగళవారం చిన్నశంకరంపేటలో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న బస్‌పాస్ చార్జీలపై 20 శాతం అదనంగా పెంచి దోచుకోవడం సిగ్గుచేటన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందించాల్సిన ప్రభుత్వమే చార్జీలు పెంచి చదువులకు దూరం చేస్తున్నదని ఆరోపించారు. వెంటనే పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

నర్సరీలలో మొక్కలను సంరక్షించాలి : ఎంపిడివో

చిన్నశంకరంపేట, జూన్ 17,ప్రభాతవార్త: వన మహోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో 3 వేల మొక్కలను నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎంపీడీవో దామోదర్ తెలిపారు. మంగళవారం మండల పరిధి గవ్వలపల్లి, గవ్వలపల్లి తండాలో నర్సరీలను ఎంపీడీవో దామోదర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమంలో గ్రామస్థులు బాగస్వాములై మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. వన మహోత్సవానికి సరిపడా మొక్కలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం గవ్వలపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి, ఇంటి నిర్మాణ నిబందనలపై పలు సూచనలు చేశారు.

గవ్వలపల్లిలో నర్సరీలను పరిశీలిస్తున్న ఎంపీడీవో దామోదర్

రామాయంపేటలో రేషన్ డీలర్ల ఆధిపత్య పోరు

ఇబ్బందులు పడుతున్న పేదలు

రామాయంపేట, జూన్ 17, ప్రభాతవార్త : రామాయంపేట పట్టణంలో రేషన్ డీలర్ల మధ్య కొనసాగుతున్న ఆధిపత్యపోరు పేదలను ఇబ్బందుల పాలుచేస్తుంది. బియ్యంఉన్నా పంపిణీ చేయకుండా పంతానికి పోతుండటంతో, మూడు నెలల బియ్యం కోసం కళ్ళల్లో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్న పేదలు ఖాళీ సంచులతో దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. రేషన్ డీలర్ల మధ్య నెలకొన్న వివాదం నిరుపేదలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. మూడునెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలనే ప్రభ్నుత్వ నిర్ణయం తీసుకోగా, వాటికి సరిపడా బియ్యం నిల్వలు లేకపోవడంతో రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా నిలిచిపోయింది. దీంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బియ్యం కోసం ఖాళీబస్తాలతో రోజూ రేషన్‌దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ పరిస్థితికి తోడు, రామాయంపేట పట్టణంలోని సిద్దిపేట రోడ్డులోని ఒక రేషన్ దుకాణానికి బియ్యం సరఫరా అయినప్పటికీ, డీలర్ల మధ్య ఉన్న వివాదం కారణంగా పంపిణీ జరగడం లేదు. బియ్యం వచ్చాయని తెలుసుకున్న స్థానికులు మంగళవారం ఉదయం నుండి ఆ దుకాణం వద్ద క్యూ కట్టారు. ఎక్కువసేపు నిల్చోలేక, ఖాళీ సంచులను వరుసలో పెట్టారు. ఇతర రేషన్ దుకాణాల డీలర్లు మాత్రం, తమకు బియ్యం సరఫరా చేయకుండా, సిద్దిపేట రోడ్డులోని దుకాణానికి అధికంగా బియ్యం పంపిణీ చేశారని ఆరోపిస్తున్నారు. ఆ ఒక్క దుకాణానికి ఎక్కువ బియ్యం కేటాయించడం వెనుక ఉద్దేశం ఏమిటి అని మిగతా డీలర్లు ప్రశ్నిస్తున్నారు.

తమకూ బియ్యం అందే వరకు పంపిణీని నిలిపివేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీంతో, బియ్యం ఉన్నప్పటికీ పేదలకు అందకుండా పోయింది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, బియ్యం సరఫరాను వేగవంతంచేసి, పేదల కష్టాలను తీర్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సిద్దిపేట రోడ్డులో ఉన్న రేషన్ దుకాణం వద్ద ఖాళీ బియ్యం సంచులు

మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పావని తదితరులు

డయాలసిస్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నర్సాపూర్ జూన్ 17, ప్రభాతవార్త: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోగల డయాలసిస్ సెంటర్‌ను కిడ్నీ వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పావని అన్నారు. మంగళవారం నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడుతూ గత నవంబర్‌లో డయాలసిస్ సెంటర్‌ను రాష్ట్ర మంత్రులు ప్రారంభించడం జరిగిందన్నారు. డయాలసిస్ సెంటర్ ఏర్పాటుతో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. డయాలసిస్ సెంటర్లో ఐదు పడక గదులు ఉండగా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా డయాలసిస్ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి నెల వంద నుండి 200 మంది వరకు డయాలసిస్ పేషెంట్లకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు అధిక సంఖ్యలో పేదవారే అయినందున ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధికంగా వేల డబ్బులు ఖర్చు చేసి డయాలసిస్ చేసుకుంటున్నారు. ఈ మేరకు నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డయాసిస్ సెంటర్ ఏర్పాటు కావడంతో కిడ్నీ వ్యాధి బారిన పడిన పేదలకు ఉచితంగా డయాలసిస్ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. వైద్య సిబ్బంది ప్రతిరోజు డయాలసిస్ పేషెంట్లకు మంచి సేవలు అందిస్తున్నారని పేర్కొంటూ గ్రామాల్లోని పేదలైన కిడ్నీ పేషెంట్లకు డయాలసిస్ అవసరమున్నచో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా డయాలసిస్ చేసుకోవాలని ఆమె సూచించారు. అంతేగాక ఈ పేషెంట్లకు నాణ్యత గల మందులను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ మేరకు ప్రజలందరూ డయాలసిస్ సెంటర్ సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పావని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రామాయంపేట, జూన్ 17, ప్రభాతవార్త : ప్రభుత్వ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకున్నప్పుడు వాటికి సార్థకత లభిస్తుంది, నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చౌదరి సుప్రభాతరావు అన్నారు. మెదక్ ఎమ్మెల్యే శ్రీ ఎం. రోహిత్ రావు ఆదేశాల మేరకు రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు కోమటిపల్లిలో మంగళవారం 10 ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం చేపట్టిన ఈ నిర్మాణాలు, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. యువ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నాడని అన్నారు. గతంలో ఎవరు చేయని అభివృద్ధి పనులు, రామాయంపేటలో వైనం పల్లి రోహిత్ రావు చేస్తున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏసుగారి రమేష్ రెడ్డి, దేమే యాదగిరి, చిలుక గంగాధర్, అల్లడి వెంకటి, చింతల స్వామి, హౌసింగ్ ఏఈ హరిత, వార్డు అధికారి ఎన్. శ్రీనివాస్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

రైతులకు అండగా సహకార సంఘాలు

రామాయంపేట, జూన్ 17, ప్రభాతవార్త : రైతులకు అండగా స్థానిక సహకార సంఘం పనిచేస్తుందని, రైతు సంక్షేమానికి కృషి చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ బాదే చంద్రం అన్నారు. మంగళవారం రామాయంపేట సహకార సంఘం నుండి నస్కల్ గ్రామానికి చెందిన రైతులకు ఖిరైతు నేస్తంఖి పథకం కింద రుణాలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ బాదే చంద్రం మాట్లాడుతూ, రామాయంపేట సహకార సంఘం రైతుల ఆర్థికాభివృద్ధికి ఎల్లప్పుడూ పనిచేస్తుందన్నారు. రైతులకు అండగా నిలవడానికి ఖిరైతు నేస్తంఖి వంటి పథకాలు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.ఈ రుణాలు రైతులకు వ్యవసాయ కార్యకలాపాలకు ఎంతగానో ఉపయోగపడతాయని, వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ఆశిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా నస్కల్ గ్రామానికి చెందిన పాగల మల్లేశంకు రూ. 9,00,000/ (తొమ్మిది లక్షలు), పాగల దేవరాజ్‌కు రూ. 9,00,000/ (తొమ్మిది లక్షలు) చొప్పున మొత్తం రూ. 18,00,000/ (పద్దెనిమిది లక్షలు) రుణాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో పుట్టి నర్సింలు, డైరెక్టర్ నస్కల్ సుధాకర్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

సర్కార్ బడిలో టీచర్ కొడుకు

పాపన్నపేట, జూన్ 17, ప్రభాతవార్త : సర్కార్ బడులపై నమ్మకం పెంచే దిశగా ఓ టీచర్ తన కొడుకును తాను పనిచేస్తున్న నాగ్సాన్పల్లి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఉపాధ్యాయ లోకానికి ఆదర్శప్రాయుడయ్యాడు. పాపన్నపేట మండలం పొడిచన్పల్లి గ్రామానికి చెందిన శ్రవణ్ కుమార్ నాగ్సాన్పల్లి ప్రాథమిక పాఠశాలలో టీచర్ గా పని చేస్తున్నాడు.మెదక్ లో నివాసం ఉంటున్నాడు. తన కొడుకు కళ్యాణ్ వర్ధన్ ను మంగళవారం ఒకటో తరగతిలో చేర్పించాడు.రోజు మెదక్ నుండి వచ్చేటపుడు తన వెంట తీసుకొని వస్తున్నాడు. చాలా మంది ప్రభుత్వ టీచర్లు తమ పిల్లలను ప్రైవేట్ బడికి పంపుతు గ్రామస్థుల పిల్లలను నర్కార్ బడికి పంపాల్సిందిగా కోరుతారనే ప్రచారం ఉంది. టీచర్లు తమ పిల్లలను నర్సార్ బడిలో చేర్చిస్తే, సామాన్య జనాలకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరుగుతుందని ఎంఇఓ ప్రతాప్ రెడ్డి అన్నారు. గ్రామస్థులు కూడా టీచర్ శ్రవణ్ కుమార్ను అభినందించారు.

అంబాజీపేటలో చౌకధరల దుకాణం ముందు బారులు తీరిన మహిళలు

రేషన్ కోసం అగచాట్లు

చిన్నశంకరంపేట, జూన్ 17,ప్రభాతవార్త: ప్రభుత్వం జూన్ నెలలో మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఇస్తుండటంతో లబ్దిదారులు చౌకధరల దుకాణాల ముందు క్యూ కడుతున్నారు. రేషన్ బియ్యం తీసుకోవడానికి లబ్ధిదారులు పడరానిపాట్లు పడుతున్నారు. అయితే సర్వర్ డౌన్ కావటం, రేషన్ కోసం ఒక్కొక్కరు ఆరుసార్లు వేలిముద్రలు వేయాల్సి రావడంతో 20 నిమిషాల కంటే ఎక్కువ సమయం పడుతుందని రేషన్ డీలర్లు తెలిపారు. దీంతో దుకాణం ముందు బియ్యం తీసుకోవడానికి గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. మండల పరిధి అంబాజీపేటలో ఉదయం 10 గంటలకు రేషన్ బియ్యం కోసం క్యూ లైన్ లో నిల్చోని మధ్యాహ్నం మూడు గంటలకు బియ్యం తీసుకొని వెళ్ళామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

పంటలపై సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి

జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభిస్తున్న వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి

ములుగు, జూన్ 17 (ప్రభాతవార్త): పంటలపై సాంకేతిక పరిజ్ఞానంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆర్టికల్చర్ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ దండ రాజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ములుగులోని ఆర్టికల్చర్ యూనివర్సిటీలో రాష్ట్రస్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల వారీగా సాంకేతిక, ఆర్థిక కుటుంబాల ఆధారంగా ఉద్యాన పరిశోధన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. వచ్చే ఐదు నుండి పది సంవత్సరాలలో రాష్ట్ర అవసరాలను తీర్చేలా ప్రణాళికలు ఉండాలని తెలిపారు. ఉద్యాన పంటల విస్తీర్ణం 12.94 లక్షల ఎకరాల నుండి 20 లక్షల ఎకరాలకు పెంచాలన్నారు. ఉద్యాన పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహిస్తూనే హైటెక్ ఆర్టికల్చర్ దిశగా దిశానిర్దేశం ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఐపి.రెడ్డి, డాక్టర్ ఎం.మనోహర్‌రావు, డాక్టర్ ఉమాదేవి, డీన్ ఆఫ్ హార్టికల్చర్ మరియు డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ చీనా నాయక్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ డి.లక్ష్మినారాయణ, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ మరియు డీన్ ఆఫ్ పిజి స్టడీస్ డాక్టర్ సురేష్‌కుమార్, యూనివర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ ఎం.రాజశేఖర్, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్, ఆఫీసర్ ఇంచార్జ్ డాక్టర్ విజయ, జోనల్ హెడ్స్, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్స్ మరియు సైంటిస్టులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత చాలా అవసరం

చిన్నశంకరంపేట, జూన్ 17,ప్రభాతవార్త: విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రత అవసరమని మండల వైద్యాధికారి సాయిసింధు అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేటలోని ఎస్టీ వసతి గృహంలోని విద్యార్థులకు సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి మందులను అందించారు. జ్వరంతో బాధపడుతున్నవారి రక్తనమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపించారు. పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల, ఆదర్శ పాఠశాల, ఎస్సీ వసతి గృహాల్లోని విద్యార్థులకు వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య సిబ్బంది, వసతి గృహ సిబ్బంది ఉన్నారు.

దివ్యాంగులకు అండగా భవిత కేంద్రాలు : ఎంఇవో

చిన్నశంకరంపేట,జూన్ 17,ప్రభాతవార్త: ప్రత్యేక అవసరాలుగల చిన్నారులకు భవిత కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని మండల విద్యాధికారి పుష్పవేణి అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేటలో భవిత కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలను విద్యార్థులను బయట కేంద్రాలకు తీసుకురావాలని, వారికి రాయడం చదివించడం నడిపించడం వంటి సేవలను అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో దీప్లానాయక్, శ్రీనివాస్‌రెడ్డి, రత్న అఖిల పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య

చిన్నశంకరంపేట,జూన్ 17,ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య లభిస్తుందని మిర్జాపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజు అన్నారు. మంగళవారం మిర్జాపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశమై మాట్లాడుతూ, ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్నిరకాల మౌళిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వప్న, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తాం

విద్యుత్ స్తంభాల కింద మొక్కలు నాటొద్దు
విద్యుత్ పరికరాల ఏర్పాటుకు ఐదెకరాల స్థలం కేటాయింపు
అక్రమంగా విద్యుత్ వాడితే కఠిన చర్యలు
విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఇ శంకర్

పాపన్నపేట, జూన్ 17, ప్రభాతవార్త : రైతులతో పాటు వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తామని జిల్లా ట్రాన్స్కో ఎస్సి శంకర్ వెల్లడించారు. ఆయన మండల కేంద్రమైన పాపన్నపేటలో మంగళవారం మాట్లాడారు. రైతుల పంట సాగుకు నిరంతరం త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచడం అవసరమని అంతమాత్రాన విద్యుత్ స్తంభాల కింద మొక్కలు నాటి ఎదిగిన తర్వాత తొలగించడం బాధాకరమని పేర్కొన్నారు. ముందుచూపుతో వైర్లకు దూరంగా మొక్కలు నాటాలన్నారు. జిల్లాలో 125 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయని, వీటితో పూర్తిస్థాయిలో విద్యుత్తు సరఫరా జరుగుతుందని వివరించారు. వినియోగదారుల తోపాటు పరిశ్రమల నుండి నెలకు 97 కోట్ల రూపాయలు ఆదాయం వస్తుందని వివరించారు. విద్యుత్ బిల్లులు సకాలంలో 90 శాతం వసూలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వినియోగదారులకు అందుబాటులో లైన్ మెన్ లు ఉండేందుకు వారికి సెల్ ఫోన్లు అందించామని వారి నెంబర్లకు సమస్య ఉంటే వెంటనే సమాచారాన్ని అందజేయాలని తెలిపారు. నిత్యం విద్యుత్ వినియోగం 587 మెగావాట్ల సరఫరా చేస్తున్నామన్నారు. 50 కోట్లతో జిల్లాల్లో విద్యుత్ శాఖకు అభివృద్ధిపనులకు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. నిధుల ద్వారా జిల్లాలో పూర్తిస్థాయిలో విద్యుత్ సమస్య లేకుండా పోతుందని తెలిపారు. విద్యుత్ పరికరాలు నిల్వ కోసం 5 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందని వాటితో విడిభాగాలు రైతులకు నేరుగా అందజేయనున్నట్లు తెలిపారు. 2021-22 నుండి 20232024 లో 13.440 వ్యవసాయ బావులుకు 77.88 కోట్లతో11.127 విద్యుత్ కనెక్షన్లు అందించడం జరిగిందని పేర్కొన్నారు. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి సంస్థకు సహకరించాలని కోరారు.

మల్లన్నసాగర్ కట్టపై హెచ్చరికబోర్డును ఏర్పాటుచేస్తున్న ఎస్సై శ్రీనివాస్

మల్లన్న సాగర్‌లోకి వెళ్లడం నిషేధం : ఎస్ఐ

కొండపాక, జూన్ 17, ప్రభాతవార్త : మలన్నసాగర్‌లోకి చేపలు పట్టడానికి, స్నానానికిగాని, ఈత నేర్చుకోవడానికిగాని వెళ్లవద్దని కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ ప్రజలను హెచ్చరించారు. మంగళవారం మల్లన్న సాగర్ కట్టపై మల్లన్న సాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎవరు వెళ్లవద్దనే హెచ్చరికతో కూడిన ప్లేక్సీని తన పోలీసు బృదంతో కలిసి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ ఎక్కువగా లోతు ఉన్నందువల్ల కొంతమంది వ్యక్తులు చేపలు పట్టడానికి వెళ్లి ప్రాణాలు పోగోట్టుకునే అవకాశం ఉన్నందున ఎవరూ మల్లన్నసాగర్ ప్రాజెక్ట్‌లోకి చేపలు పట్టడానికిగాని, స్నానానికిగాని, ఈత నేర్చుకోవడానికిగాని వెళ్లవద్దని సూచించారు. సరదా వెళ్లి విలువైన ప్రాణాలు పొగోట్టుకొని తల్లిదండ్రులను దు:ఖ సాగరంలో ముంచవద్దని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలు ఎక్కడకి వెళ్తున్నారు,ఎవరితో వెళ్తున్నారు గమనిస్తు ఉండాలన్నారు. ప్రాజెక్ట్ లోకి వెళ్లి చేపలు పట్టడం నిషేధమని తెలిపారు. ప్రాజెక్ట్‌లో మొసళ్ళు తిరుతున్నాయని ఎవ్వరు కూడా ప్రాజెక్ట్‌లోకి వెళ్లవద్దని హెచ్చరించారు.

ఇష్టపడి చదివేతే ప్రయోజకులవుతారు : ఎఎస్ఐ

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ రవీందర్‌రెడ్డి

మర్కుక్, జూన్ 17 (ప్రభాతవార్త): కష్టంతో కాకుండా ఇష్టపడి చదివే వారు భవిష్యత్తులో ప్రయోజకులు అవుతారని మర్కుక్ ఏఎస్ఐ రవీందర్ పేర్కొన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మంగళవారం మర్కుక్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, మత్తు పదార్థాలు, ఈవిటీజింగ్, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ రవీందర్, గజ్వేల్ షీటీమ్ బృందం హెడ్‌కానిస్టేబుల్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ అవసరమైతే తప్ప సోషల్ మీడియాను ఉపయోగించవద్దని, విద్యార్థి దశ చాలా కీలకమని, సక్రమ మార్గంలో వెళ్ళే వారు ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దని, తెలియని వయస్సులో ప్రేమ పెళ్ళి అంటూ జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే ఉపాధ్యాయులకు లేదా ప్రధానోపాధ్యాయునికి తెలియపర్చాలని, లేనియెడల పోలీసులకు, షీటీమ్స్‌ను డయల్ 100, సిద్దిపేట షీటీమ్ నెం.8712667 434 నెంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించేవారిపేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ యాదయ్య, మహిళా కానిస్టేబుళ్లు శ్యామల, లావణ్య, కానిస్టేబుళ్లు మహేష్, రామచంద్రారెడ్డి, శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు : ఎవో

నర్సాపూర్ జూన్ 17, ప్రభాతవార్త: ఎరువుల, విత్తనాల విక్రయించే దుకాణదారులు కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠి

చిన్నారులకు అక్షరాభ్యాసంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరభ్యాసం

కొండాపూర్, జూన్ 17(ప్రభాతవార్త): పోషణ్ అభియాన్‌లో భాగంగా కొండాపూర్ మండలం అనంతసాగర్‌లో సోమవారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. తల్లిదండ్రులు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు. చిన్నారులకు అంగన్వాడి కేంద్రంలో ఆటలతో పాటు చదువుపై ఆసక్తి కలిగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి ఇందిర, అంగన్‌వాడీ టీచర్లు సునంద, అరుణ, రేఖ, సరిత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సత్కారం

సదాశివపేట, జూన్ 17(ప్రభాతవార్త): ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన ప్రథమ సంవత్సరం విద్యార్థులను సదాశివపేటలోని భవిత కళాశాల అధ్యాపకులు, యజమాన్యం ఘనంగా సత్కరించారు. ఎంపిసిలో వరుణ్‌కుమార్ 470 మార్కులకుగాను 466 మార్కులు సాధించి రాష్ట్రంలో మూడవ ర్యాంకు, సిఈసిలో బి.వర్ష 500కుగాను 488 మార్కులు సాధించి ఆరో ర్యాంకు, బైపిసిలో జువేరియా ఆఫ్రిన్ 440 మార్కులకుగాను 432 మార్కులు సాధించి పట్టణంలో మొదటి ర్యాంకు సాధించారని ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ బాలరాజు తెలిపారు. ఈ సందర్భంగా వారిని సత్కరించి బహుమతులు అందజేశారు.

నారాయణ్‌ఖేడ్‌లో...

నారాయణ్‌ఖేడ్ జూన్ 17 ప్రభుతవార్త : పట్టణంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల ఇంటర్‌మీడియట్ విద్యార్థులు రాష్ట్రంలో రెండు, నాలుగో ర్యాంక్ సాధించిన ఎ.నికిత, వి.శ్రీసంహితలను డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి అధ్యాపకులు మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ఇంటర్ ఫస్ట్ ఇయర్ స్టేట్ 2,4 ర్యాంక్ విద్యార్థినులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రవి, కిరణ్, కిషోర్, సంతోష్, నరసింహారెడ్డి, రవీందర్, నాయకులు అర్జున్, మాజీ ఎంపీటీసీ, కిషన్ రాథోడ్, బి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నారాయణఖేడ్, జూన్ 17 ప్రభాతవార్త : అధిక ఫీజులకు పాల్పడుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు మండల విద్యాశాఖ అధికారికి అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ నారాయణఖేడ్‌లో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదన్నారు. విద్యను వ్యాపారం చేస్తూ స్కూల్లో అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫామ్, టై, బెల్టు షూ అమ్ముతున్నారని చెప్పారు. కొన్ని పాఠశాలలకు గ్రౌండ్ లేదని, 10వ తరగతి వరకు పర్మిషన్ తీసుకోని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తుంది. అలాగే అర్హత కలిగిన టీచర్స్ లేకుండా స్కూల్ నడుపుతున్నారని, తల్లిదండ్రులు విద్యార్థులు మోసపోకుండా పర్మిషన్ లేని పాఠశాల పేర్లను ప్రెస్ మీట్ పెట్టి తెలియజేయాలన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనట్లయితే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

సిర్గాపూర్ పోలీసు ఠాణాను తనిఖీ చేసిన ఎస్‌పి

సిర్గాపూర్ పోలీసు ఠాణాను పరిశీలిస్తున్న ఎస్‌పి పరితోష్ పంకజ్

సిర్గాపూర్, జూన్ 17, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని పోలీసు ఠాణాను సంగారెడ్డి జిల్లా ఎస్‌పి పరితోష్‌పంకజ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఠాణాకు చేరుకున్న ఎస్‌పి పరితోష్ పంకజ్ పరిసరాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఠాణా పరిసరాల్లోని పోలీస్ హెడ్ క్వార్టర్‌లను ఎస్‌పి ప్రత్యేకంగా పరిశీలించారు. పోలీసు ఠాణాలో నమోదైన కేసుల వివరాలను ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లుని ఎస్‌పి అడిగి తెలుసుకున్నారు. ఎస్‌పి వెంట డిఎస్‌పి, సిఐ తదితరులు ఉన్నారు.

డ్రైనేజీ పనులను పరిశీలించిన కార్పొరేటర్

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం, జూన్ 17, ప్రభాతవార్త: రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీ సండే మార్కెట్ బస్ రూట్‌లో 10వ బ్లాక్‌లో రూ. 25 లక్షలతో కొనసాగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను కార్పొరేటర్, జిహెచ్‌సిఎం స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ అధికారులు, కాలనీ వాసులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ డ్రైనేజీ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, పనులు పూర్తయితే సిసి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో జలమండలి డిజిఎం శివకృష్ణ, మేనేజర్ లోకేష్, కాంగ్రెస్ నాయకులు పీటర్, హబీబ్, సామ్రాట్, రంజీ, శ్రీకాంత్ నాయక్, సిఎం మల్లేష్, బైకన్ నవీన్ యాదవ్, హన్మంతు, రమేష్, సత్తయ్య వసంత్ తదితరులు ఉన్నారు.

మెరిసిన విద్యా కుసుమం

-ఇంటర్‌లో రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు

సిర్గాపూర్, జూన్ 17, ప్రభాతవార్త: మండల పరిధిలోని పోట్‌పల్లి గ్రామానికి చెందిన ఏనుగుంది వినూత, శ్రీనివాస్‌రెడ్డి దంపతుల కుమార్తె రిషికారెడ్డి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపిసిలో 470మార్కులకుగాను 468 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకును సొంతం చేసుకుంది. శ్రీఅభిదాజూన్ కళాశాలలో ఎంపిసిలో విద్యను అందుకున్న రిషికారెడ్డి రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంక్ సాధించడం పట్ల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

స్థానిక ఎన్నికల ప్రభుత్వ ప్రకటనను స్వాగతిస్తున్నాం

గజ్వేల్, జూన్ 17 (ప్రభాతవార్త): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయించి కాంగ్రెస్ పార్టీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బిజెపి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ అన్నారు. ప్రధానిగా నరేంద్రమోడి 11 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులో మొక్కలు నాటడంతో పాటు నరేంద్ర మోడి సుపరిపాలనను, కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మనోహర్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులు పర్యటనలకే పరిమితమయ్యారని, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో గతంలో స్వయంగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీని సందర్శించి ప్రజల సమస్యలుతీరుస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటనను స్వాగతిస్తున్నాం కానీ శాసనసభ ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

మొక్కను నాటుతున్న బిజెపి నాయకులు దేవులపల్లి మనోహర్ యాదవ్ తదితరులు

స్వాతంత్ర్యం అనంతరం మొదటిసారి జనగణనతో పాటు కులగణన చేయాలని చారిత్రాత్మక నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకుందని, 34 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ నియమిత సిబ్బందితో జరగనున్న ఈ జనాభా సేకరణ వల్ల దేశంలోని అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలలో తీసుకోవాల్సిన ప్రాధాన్యతలకు నూతన ఒరవడి ఏర్పడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెప్యాల వెంకట్‌రెడ్డి, నాయకులు నాగు ముదిరాజ్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి ఉపాధ్యక్షుడు మైస విజయ్, చెన్నోజి నీరజ, కోశాధికారి లింగంపల్లి హరి, నాయకులు చిలువేరి కుంకుమరాణి, భక్తమాల, రాజు, రాజేశ్వర్‌చారి, స్వరాజ్యలక్ష్మి, మైస స్వామి పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న ఎబివిపి నాయకులు

విద్యార్థి నేతపై దాడి చేసినవారిని అరెస్టు చేయాలి

ఎబివిపి జాతీయ కార్యదర్శి శ్రవణ్ బి రాజ్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: విద్యార్థి నాయకునిపై హత్యాయత్నం చేసిన రాజ్యాంగ వ్యతిరేక గుండాలను వెంటనే అరెస్టు చేయాలని ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రవణ్ బి రాజ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్ వద్ద మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి మాట్లాడారు. నిత్యం విద్యారంగ సమస్యలపై సామాజిక సమస్యలపై పోరాటం చేసే ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌పై రాజ్యాంగ వ్యతిరేక గుండాలు దాడి చేయడం సిగ్గుచేటన్నారు. రాజ్యాంగాన్ని,ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని చెప్పినందుకు అదిత్యపై హత్యాయత్నం చేయడానికి ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు, నాయకులు వివేక్, పవన్, ఫణీంద్ర,చరణ్,రాజ్, రాకేష్, రాహుల్, వసంత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న రవికుమార్

సిద్దిపేట రూరల్, జూన్ 17, ప్రభాతవార్త : దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం నిర్వహించిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సామవేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూల్ 9న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను నిర్వహించడం జరుగుతుందన్నారు. కేంద్రంలోని బిజెపి సర్కారు కార్మిక వర్గానికి ఉన్న 29 చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కార్పోరేట్ శక్తులకు యజమానులకు అనుకూలమైనటువంటి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చిందన్నారు. కేంద్ర సర్కారు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో టి.వెంకన్న, టి.రాజు, చంద్రయ్య, బాలయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ సర్కారు

కొమురవెల్లి, జూన్ 17, ప్రభాతవార్త : గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ సర్కారు గాలికి వదిలేసి అస్తవ్యస్తంగా మార్చిందని..అభివృద్ధి పనులు లేక పోవడంతో కుంటుపడుతున్నాయని బిఆర్ఎస్ నాయకులు ఏర్పుల మహేష్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు స్తంభించడంతో పాటు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా సక్రమంగా లేదన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. బిఆర్ఎస్ సర్కారు హయాంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందితే కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో అభివృద్ధి ఏమాత్రం కనిపించడం లేదన్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటీ వరకు అభివృద్ధి పనులకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామ పంచాయతీలు అభివృద్ధికి అమడదూరంలో ఉన్నాయన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు రవి, చంద్రం, గజ్జె వెంకటేష్, ముక్క విరాట్‌బాబు, అజయ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయయకులు

సిద్దిపేట ఆర్డీఓకు భూ సమస్యలను వివరిస్తున్న శ్రీనివాస్

భూసమస్యల పరిష్కారానికి భూభారతి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్

కొమురవెల్లి, జూన్ 17, ప్రభాతవార్త : ధరణి దరిద్రాలను రూపుమాపేందుకే కాంగ్రెస్ సర్కారు భూభారతి చట్టం తీసుకొచ్చిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ అన్నారు. కొమురవెల్లిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సు సిద్దిపేట ఆర్డీఓ సదానందం, తహశీల్దార్ జి.దివ్య ఆధ్వర్యంలో నిర్వహించగా పలు భూ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ధరణి తో రైతులు,ప్రజలు అనేక కష్టాలు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ హయాంలో భూ సమస్యల పరిష్కారానికి రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. రైతుల,ప్రజల సమస్యలను పరిష్కరించడానికే సర్కారు భూ భారతి చట్టం తెచ్చిందన్నారు. భూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కొత్త చట్టం ద్వారా పరిష్కరించుకోవడానికి భూ భారతి చట్టం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రెవెన్యూ సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో బోధనకు ధరఖాస్తులు ఆహ్వానం

కంది, జూన్ 17, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఓడిఎఫ్‌లోని కేంద్రీయ విద్యాలయంలో తాత్కాలిక పద్ధతితో విద్యా బోధన చేసేందుకు ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ భారతీదేవి తెలిపారు. టీజీటీ (ఆంగ్లము, సోషల్) పీఆర్ (ప్రైమరీ టీచర్), స్పెషల్ ఎడ్యూకేటర్, కౌన్సిలర్ పోస్టులకు అర్హులైన వారు ధరఖాస్తులు చేసుకోవాలన్నారు.

అంగన్‌వాడీలలో పిల్లలకు సృజనాత్మక పెంపు : సిడిపివో

అక్షరాభ్యాసం చేస్తున్న సిడిపివో శారద తదితరులు

సిద్దిపేట అర్బన్, జూన్ 17,ప్రభాతవార్త : పిల్లలకు అన్నిరకాల మెలకువలను నేర్పించడంతో పాటు సృజనాత్మకతను పెంపొందించడానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయని సిడిపిఓ శారద అన్నారు. అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించిన అనంతరం అమె మాట్లాడారు. చిన్నారులకు ఆటలు పాటలు పోషక ఆహారంతో పాటు సమాజంలో మెదులుకునే విధానం పాఠశాలకు వెళ్లాల్సిన పద్ధతి అంగన్‌వాడీలో నేర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ టీచర్స్ సరోజన, లావణ్య, లత, విజయ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన

గజ్వేల్ టౌన్, జూన్ 17 (ప్రభాతవార్త): పరిసరాల పరిశుభ్రత, తడిచెత్త, పొడిచెత్త వేరుచేసే విధానంపై గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లోని ప్రజలకు మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య అవగాహన కల్పించారు. మంగళవారం పిడిచెడ్‌రోడ్డులోని రైల్వే బ్రిడ్జ్ వద్ద గల నాలా క్లీనింగ్‌ను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని అన్ని వార్డుల్లో నాలుగు టీములుగా సిజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మొదటి దశలో గుర్తిస్తే టిబిని అరికట్టవచ్చు

డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్

గజ్వేల్ టౌన్, జూన్ 17 (ప్రభాతవార్త): ట్యూబర్ క్లోసిస్ (టిబి) వ్యాధిని మొదటి దశలో గుర్తించినట్లయితే ఆ వ్యాధి బారిన పడకుండా చూడొచ్చని గజ్వేల్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం గజ్వేల్ మండలం అహ్మదీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిఎంహెచ్‌ఓ పల్వాస్‌కుమార్ ఆదేశాల మేరకు ఇంపాక్ట్ ప్రొజెక్ట్ టిబి అలర్ట్ ఇండియా ఆధ్వర్యంలో టిబి వ్యాధిపై అవగాహన, టిబి వ్యాధి నిర్మూలనలో విజయవంతమైన వ్యాధిగ్రస్తులు టిబి ఛాంపియన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ టిబి వ్యాధిబారినపడిన వారు మొదటి దశలో మందులు సక్రమంగా వాడినట్లయితే పూర్తిగా అరికట్టవచ్చని అన్నారు. టిబి చాంపియన్‌గా వ్యాధి నుండి విముక్తి పొందిన వారిని ఈ సందర్భంగా అభినందించారు.

మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

టిబి వచ్చిన వారిలో ముఖ్యంగా బరువు తగ్గడం, దగ్గుతో తెమడ రావడం, జ్వరం, ఒళ్లు నొప్పులు, ఆకలి మందగించడం జరుగుతుందని, ఇది గమనించి తెమడపరీక్ష చేపించుకుంటే టిబి వ్యాధిని గుర్తించవచ్చన్నారు. టిబి వచ్చిన వారు ఆరు నెలలు క్రమంతప్పకుండా మందులు వాడినట్లయితే వ్యాధిని అరికట్టవచ్చన్నారు. శ్రీనివాస్ డిఎల్ టిబి అలర్ట్ ఇండియా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాను టిబి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ డివిజన్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ప్రణయ్‌కుమార్, డాక్టర్ బల్బీర్‌సింగ్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ మహారాజ్, పారా మెడికల్ సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడిఏ నూతన్‌కుమార్

ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసిన ఎడిఎ

కంగ్టి, జూన్ 17, ప్రభాతవార్త: మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలను సహాయ వ్యవసాయ సంచాలకులు కె.నూతన్‌కుమార్ మంగళవారం తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా నూతన్‌కుమార్ దుకాణాల్లోని రికార్డులను పరిశీలించి డీలర్లకు, రైతులకు పలు సూచనలు చేశారు. దుకాణాల్లో అన్నిరకాల, అన్ని కంపెనీల పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు అధీకృత డీలర్ల వద్దే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసుకోవాలని, రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశాక రశీదులను విధిగా అందుకుని పంట చేతికి వచ్చే వరకు భద్రపర్చుకోవాలని రైతులకు సూచించారు. డీలర్లు స్టాక్ వివరాలను వ్యవసాయ అధికారులకు అందిస్తూ ఉండాలని, అధిక ధరలకు, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఈపాస్ మిషన్ ద్వారానే ఎరువులను అమ్మలన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన కాంప్లెక్స్ హెచ్ఎం

సిర్గాపూర్, జూన్ 17, ప్రభాతవార్త: మండలపరిధిలోని వంగ్దాల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను మంగళవారం వాసర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశమై విద్యా బోధనపై పలు సూచనలు చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. గ్రామంలో తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందుకుంటే కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని రమేష్ గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తుకారం, రహీంలు ఉన్నారు.

మీ సేవ కేంద్రాలను తహసీల్దార్ తనిఖీ

మీసేవ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న దృశ్యం

సంగారెడ్డి మున్సిపాలిటీ జూన్ 17,ప్రభాతవార్త: పట్టణంలోని కల్వకుంట దారిలో గల శ్రీ సాయి కమ్యూనికేషన్ మీ సేవ సెంటర్, బాపు గ్రాఫిక్స్ మీసేవ సెంటర్‌లను మంగళవారం తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలు వసులు చేయాలని, అధిక ధరలు వసులు చేస్తే మీ సేవ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెట్టి సీజ్ చేయడం జరిగుతుందని తహసీల్దార్ జయరాం ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంకేతిక విభాగం ఉదయ్ మీ సేవ నిర్వాహకులు పాల్గొన్నారు.

అప్పుల తెలంగాణగా మార్చిన గత పాలకులు

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గుమ్మడిదల జూన్17(ప్రభాతవార్త): ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత లక్ష కోట్ల ఆదాయంలో ఉన్న రాష్ట్రాన్ని గత పాలకులు అప్పుల తెలంగాణగా మార్చారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగ్‌రావు అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ తెలంగాణను దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా సిఎం రేవంత్‌రెడ్డి తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతన్నల పాలిట ఒక వరంలాంటిదని స్పష్టం చేశారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని చెప్పారు. గుమ్మడిదల మున్సిపాలిటీతో పాటు మండలంలో రైతులు 6,500 మంది 7680 కొత్త పాస్ బుక్కులు కలిగి ఉన్నారని తెలిపారు. సుమారు రైతు భరోసా 6 కోట్ల పైచిలుకుగా రైతుల ఖాతా లోకి జమయిందని అన్నారు. ఇంకా మిగిలిన రైతులకు మరో రెండు మూడు రోజుల్లో సుమారు నాలుగు కోట్ల రూపాయలు జమవుతాయని అన్నారు. రాష్ట్రంలో రైతులకు సమయానికి కావలసిన విత్తనాలు మందులు సరఫరా అందుబాటులోకి తెస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్సేనని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో రైతుల గృహాలలో సంతోషకర మహోత్స కార్యక్రమం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తారని ఆయనే సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరభద్ర స్వామి ఆలయ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి, పడమటి మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న రైతుభరోసా దరఖాస్తులు : ఎవో

గుమ్మడిదల జూన్17(ప్రభాతవార్త): పట్టణంలోని రైతువేదికలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ జూన్ 5వ తేదీ వరకు భూమి కొనుగోలు చేసిన కొత్త పాస్ బుక్కు వంశ పరంగా మార్చిన కొత్తగా పాస్ బుక్ వచ్చిన లేక డిజిటల్ కాపీ ఉన్న ప్రతి రైతుకు, రైతు భరోసా పథకానికి అర్హులని తెలిపారు. రైతులు ఇదివరకు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోలేని రైతులు వానాకాలం 2025 రైతు భరోసా పథకం కోసం మీ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇందుకు కావలసిన పత్రాలు:పట్టేదారు పాసుబుక్ జిరాక్స్.ఆధార్ జిరాక్స్.సేవింగ్ బ్యాంకు అకౌంట్ పాసుబుక్ జిరాక్స్ దరఖాస్తు ఫారం.దరఖాస్తులు స్వీకరణకు చివరి తేది నేటి వరకు అనగా 18.06.2025. దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.ఇదివరకే రైతు భరోసా పైసలు పడుతున్న రైతులు మరలా దరఖాస్తు చేసుకోవలసిన అవసరం లేదని అన్నారు. దరఖాస్తు చేసుకొని రైతులు తమ సంబంధిత పత్రాలను